# లక్ష్యం

ఈ రోజు దీపావళి పండుగా?-కాదు. సంక్రాంతా? - కాదు. మరి ఉగాదా? కానే కాదు.

అయితే మా ఊరి ప్రజల్లో ఇంత ఉత్సాహం, ఇంత ఆహ్లాదం ఎందుకు? భారతదేశ పౌరులు అల్ప సంతోషులు. సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అణచుకోలేరు. తమ ఆనందానికి సూచకంగా వీధిలో పచ్చతోరణాలు కట్టేరు, రంగు కాగితాల జండాలు అమర్చేరు. అరటిబోదెలతో వీధి వీధినా స్వాగత స్తంభాలు - సుస్వాగతం బోర్డులు అమర్చేరు. ఇళ్ళలో దీపతోరణాలు ప్రజ్వలింపజేసేరు. పిల్లలు మామూలు పండుగలో కన్నా ఆనందంగా ఆడుతూ పాడుతూ కేరింతలు కొడుతున్నారు.

కారణం?!

మా ఊరికి హరిజన మంత్రిగారు విచ్చేస్తున్నారు.

పొరపాటు. పై వాక్యంలో చిన్న పొరపాటు దొర్లిపోయింది. మంత్రిగారు హరిజనులు కారు. శుద్ధ బ్రాహ్మణులు. వారు హరిజన శాఖకు మంత్రి. ఊరక రారు మహాత్ములంటారు. వస్తున్నవారు మహాత్ములేకారు - అమాత్యులు కూడాను. అతన్ని గెలిపించిన నియోజక వర్గంలో మా ఊరుకూడా ఉంది. నియోజకవర్గం సంపన్నం కావాలన్నది వారి లక్ష్యం. అందుకే కేబినెట్‌లో తీవ్రంగా వాదించి హరిజనుల సంక్షేమ పథకం క్రింద వారి గృహాల నిర్మాణానికై ఇరవై అయిదువేలు కేటాయించి లక్ష్యాన్ని సాధించేరు. మంత్రిగారి కరకమలాలద్వారా నేడే శంకుస్థాపన.

గ్రామపెద్దలు పెళ్ళివారి మల్లే తయారై మంత్రిగారికి సకల రాజోపచారాలు, సౌకర్యాలు సమకూర్చడంలో సతమతమై కాలు గాలిన పిల్లుల్లా కార్లమీదా, స్కూటర్లమీదా, వాటికి నోచుకోని వారు సైకిళ్ళమీదా తిరుగుతున్నారు.

మూడువందల హరిజన గడపలున్న మా వూరిలో మొట్టమొదటగా అయిదేసి వేల రూపాయలతో ఒక్కొక్క జనతా ఇంటిని కట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇది నాంది ప్రస్తావనే. రాగల సంవత్సరాలలో కేటాయింపు అధికం చేస్తారు. ఇళ్ళు ఇంకా కడతారు.

అయితే ఈ పథకం గురించి తెలిసిన తరువాత చిన్న చిన్న తగవులు జరగకపోలేదు. 'మరి వెనకబడిన తరగతుల మాటేమిటి?' అన్నారు ఆ తరగతుల వాళ్ళు. 'హరిజనులకేనా అన్నింటిలోనూ - ఆధిక్యం? మా గురించి ఆలోచించవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా?' అన్నారు బీదరికపు గీతకు క్రిందనున్న సవర్ణులు. 'మా ఓట్లు లేకుండానే వారు ఎన్నికల్లో గెలిచి ఉండేవారా?' అని కొందరు సవాలు చేసేరు. ఈవిధంగా పై తరగతుల వాళ్ళు తమ రోషాన్ని మాటలతో బయట పెట్టేరు.

హరిజనులు అలా కాదు. కర్రలతోనూ, ఈటెలతోనూ ద్వంద్వయుద్ధం జరిపేరు. సహాయం వారికే అందుతూంటే ఎందుకీ జగడం అని అనకండి. వాళ్ళలో బోలెడు తెగలు - జాతులు. మాకే ఇళ్ళురావాలంటే మాకే రావాలని వాళ్ళపంతాలు. పోలీసుకాల్పులవరకు వెళ్ళాయి వాళ్ళ అంతర్యుద్ధాలు.

పత్రికలకు నేడు స్వాతంత్ర్యం వచ్చిందంటారు. కాని ఏం లాభం? ఆ దొమ్మీలో ఎంత మంది చచ్చినా ఏ పత్రికలోనూ ఆ వార్త పొక్కలేదు.

అందుకు మా జిల్లా అధికారులు తీసుకున్న ముందు జాగ్రత్తలు కారణం. అంటే, దొమ్మీలు జరగకుండా, చావులు జరగకుండా ముందు చర్యలు తీసుకున్నారని నా భావం అనుకుంటే అది పొరపాటే. దొంగపోయిన ఆరు మాసాలకు కుక్క మొరిగిందట. అది నిజమో - సామెతో నాకు తెలియదు. పోలీసులు మా ఊరికొచ్చింది దెబ్బలాటలు ముమ్మరంగా సాగిన తరువాతే. చావు వార్తలు పత్రికల కెక్కకుండా వారు తీసుకున్న ముందుచర్యల మాట నేనన్నది.

తరువాత సభలు, సంప్రతింపులు జరిగాయి. జననష్టం అయిన తరువాత వారిలో వారికి ఒడంబడికలు కుదిరేయి. ఇళ్ళు కట్టిన తరువాత లాటరీ ద్వారా పంపిణీలు జరుగుతాయని పెద్దలు హామీ ఇచ్చారు.

ఇవి ఇలా కొనసాగుతూ ఉంటే, ఆ గ్రాంటు సొమ్ము సంపాదించడంకోసం ప్రెసిడెంటుగారు హైదరాబాదు రాకపోకలు సాగించారు. ఎట్టకేలకు చెక్కు ముట్టింది. మంత్రిగారు స్వయంగాచెక్కు తీసుకొని వస్తున్నారు. లాంఛనప్రాయంగా మా గ్రామపంచాయతీ ప్రెసిడెంటు గారికి సభలో అందిస్తారు. ఇళ్ళ నిర్మాణ స్థలంలో పాలరాతి పలక పాతిపెడతారు.

మంత్రిగారి ప్రసంగం వినడానికి మా ఊరి ప్రజలేకాదు, చుట్టుప్రక్కల గ్రామాల వారు కూడా తిరునాళ్ళకు వచ్చినట్టు వస్తున్నారు. జిల్లా అధికారులు, పోలీసులు సరేసరి.

సభలో మంత్రిగారు చప్పట్లమధ్య 'దేశానికి వెన్నెముక గ్రామాలు. ఆ గ్రామాలకు పునాదిరాళ్ళు హరిజనులు. వాళ్ళను ఉపేక్షిస్తే దేశం పురోభివృద్ధి గాదు. మా ప్రభుత్వ లక్ష్యం ఈ అడుగుబడిన వాళ్ళను ఉద్ధరించడం. నేడు చాలా శుభదినం. మన గ్రామం కోసం నేను పాటుపడుతున్నాను. మీ సౌభాగ్యమే నా సౌభాగ్యం. మీ సేవ చేయడం నా రాజకీయ లక్ష్యం. మీరు కలకలలాడితే నేను ఆడుతున్నట్లే భావిస్తున్నాను. మీరు ప్రభుత్వంతో అన్నివిధాలా సహకరించాలి. ఈ గ్రాంటు 25వేలు చాలా చిన్నదే. ఐతే మనదేశంలో ఉన్న గ్రామాల దృష్ట్యా ఇది చిన్నది కాదు. ఇంత మొత్తం కూడా అన్నిగ్రామాలకు అందలేదు. మనకి అందింది. మన ఊరి ప్రెసిడెంటు గారు ఇళ్ళ నిర్మాణం త్వరలో పూర్తిచేస్తారు. పది మాసాల్లో ఖర్చుల వివరాలు పంపుతారు' అన్నారు. వారు సుమారు గంటన్నరసేపు ప్రసంగించారు. అందులో మన కథావస్తువుకి సంబంధించిందింతే. మిగతాది వారి ప్రతిద్వంద్వుల గురించి, ప్రభుత్వాన్ని పడదోయాలని వారు చేస్తున్న పన్నుగడల గురించి - ఇత్యాది, ఇత్యాది.

★ ★ ★

మంత్రిగా రిచ్చిన చెక్కు మారి మా వూరి పంచాయతీ పుస్తకాలలోకి ఎక్కింది.

పంచాయతీ మెంబరు చిన్నయ్య ఒకరోజు ప్రెసిడెంటు గారి దగ్గరకు తన వాళ్ళలో ఒక పదిమంది పెద్దలతో వచ్చి లాటరీ వేసి, వాటిలో ఎవరి పేరు వస్తే వారికి తలో అయిదేసి వేలు

ఇస్తే వాళ్ళే ఇళ్ళు కట్టుకుంటారని అన్నాడు.

"అలా చేయండి. బాబూ! అలాగైతే ఈ వానలకు ముందే ఇళ్ళు పూర్తవుతాయి" అన్నారు ఆ పదిమంది.

"అబ్బే, అలా కుదరదురా! పంచాయతీ ద్వారా అన్ని ఇళ్ళూ కట్టించి అప్పుడే లాటరీ తీస్తాం. మీకు డబ్బు ఇవ్వడానికి రూలు ఒప్పుకోదు" అన్నారు ప్రెసిడెంటుగారు.

మీటింగులు - పార్టీలు.

కనీసం నాలుగైదు మీటింగులయ్యేయి.

ఇళ్ళు లాకాయిలూకాయిగా కట్టడం ప్రెసిడెంటు గారికి ఇష్టంలేదు. ఇళ్ళ డిజైను దాబుగా ఉండాలి.

పత్రికల్లో ప్రకటనలన్నారు. టెండర్లన్నారు.

"బాబూ! అయిదు వేల రూపాయలతో ఇల్లు కట్టాలి. మనం ఈ హంగామాలన్నీ చేస్తే ఇళ్ళొస్తాయా?" అన్నాడు చిన్నయ్య - మెంబర్లలో చిన్నవాడు. జాతిలో చిన్నవాడు. హరిజనుల్లో అతనే చదువుకున్నవాడు. చిన్నతనంలో మేనమామ ఇంటిలో పట్నంలో పెరిగాడు. పదోక్లాసు వరకు చదివేడు. ఆ మాటకొస్తే పంచాయతీ సభ్యుల్లో అంతగా చదువుకున్నవాడు వాడొక్కడే. వాడంటే ప్రెసిడెంటుకి, ఇతర మెంబర్లకు ఒళ్లు మంట.

"చిన్నయ్యా! ప్రెసిడెంటు గారు చెప్పింది అర్థం చేసుకో. వారు నీకంటే పెద్దవారు." నోరు మూసేసేడు కాపువీధి ప్రతినిధి వీరాస్వామి.

"నేను తెలియక అనడంలేదు. ఇది నీ సొంత సొమ్ము, నా స్వంత సొమ్ము కాదు - ఇష్టం వచ్చినట్టు ఖర్చు చేయడానికి. ప్రభుత్వం డబ్బు. వాటికి ఖరాఖండీగా లెక్కలు చూపాలి. పైసా వారా వచ్చినా మనమంతా జైలు కెళ్ళాలి" అన్నాడు చుట్టకాలుస్తూ ప్రెసిడెంటుగారు.

ఎవరూ మాట్లాడక పోయేసరికి ఆరిపోయిన చుట్టను తిరిగిముట్టించి "నే చెప్పొచ్చే దేమిటంటే, దేశం నలుమూలలా ప్రభుత్వ పథకాన్ని, లక్ష్యాన్ని తెలియజేస్తూ ప్రకటనలు పంపాలి. అప్పుడే కదా మనవూరి గురించి ప్రభుత్వం చేసే కృషి నలుగురికీ తెలిసేది. ఇళ్ల నిర్మాణానికి ఇదో కండిషన్."

"అవును, మంత్రిగారి ఫోటోలతోకూడా వార్తలు పడాలి. మంత్రిగారు విజయనగరం సర్క్యూటు హౌస్‌లో ఆ మాట నాతో అన్నారు." వంతపాడాడు మెంబరు వీరాస్వామి.

"ఇంకేం? అందుకో వెయ్యి రూపాయలు ఖర్చు." చిన్నయ్య ఉక్రోషంగా అన్నాడు.

"చూడు, చిన్నయ్యా, నువ్వు మీటింగు జరగనిచ్చేటట్టులేదు. మెజారిటీ వాళ్ళమాట నెగ్గుతుంది. నువ్వు మాట్లాడకకూర్చో" ఒక మెంబరు కసిరేడు.

"మీ మాటే చెల్లించుకోండి. నే పోతున్నాను. అవతల పొలానికి నీరు పెట్టుకోవాలి" అంటూ వెళ్లిపోయేడు చిన్నయ్య.

ఆ తరువాత కాఫీ ఫలహారాలు ముగిసేయి. చిన్న మనవి. కాఫీ ఫలహారాలు అన్నాను సభ్యతకోసం. అది ఒక చిన్నరకం డిన్నరు పార్టీ. విదేశీ సారా లేందే అలాంటిపార్టీలు జరగవు. ఆ విషయం రాస్తే వాళ్ల పరువు బట్టబయలుచేసినవాడినౌతాను. ఆ పాపం నాకెందుకు ఎవరెలాతింటే

మధ్య నాదేం పోయింది? చర్చలు కూడా సాగాయి. అసలు విషయం వదిలేసి సినిమాస్టార్ల కబుర్లు జోరుగా సాగేయి. మరి ఒంటిమీద తెలివిలేనివాళ్ళు వాగేదెలా గుంటుందో మీకు మాత్రం తెలియదా?

పనులు తొందరగా మొదలయ్యేయి. పత్రికల్లో విజ్ఞప్తులు వెళ్ళాయి. తరువాత టెండర్లు పిలిచేరు. ఢిల్లీ నుండి రెండు, హైదరాబాద్, మద్రాసు, బెంగుళూరుల నించి చెరొకటి వచ్చాయి.

"ఈ టెండర్లను ఎంపిక చేసేముందు నేనోమారు ఢిల్లీ వాళ్ళను కలుస్తాను. అటునుంచి చండీఘర్ చూసొస్తాను. అక్కడ ప్రభుత్వ భవనాలు ఘనంగా కట్టేరంట" అన్నారు ప్రెసిడెంటుగారు.

చిన్నయ్య ప్రతిఘటించేడు. ఆనవాయితీగా మెజారిటీ ఓడించి చిత్తు చేసింది.

తీర్మానించుకున్న ప్రకారం ప్రెసిడెంటుగారు ఢిల్లీ వెళ్ళేరు కుటుంబ సమేతంగా. ఈనాడిది నాయకులకు, అధికారులకు పరిపాటైంది. ఆఫీసు పనిమీద పెళ్ళాం బిడ్డలతో వెళ్ళడం పరిపాటికి విరుద్ధంగా మావూరి నాయకుడు ప్రవర్తించాడంటే వూరికెంత నామర్దా?

పదిహేను రోజులు దేశాలు పర్యటించి వచ్చి మీటింగు పెట్టేరు.

"ఇదిగోనయ్యా! నేను స్వంతంగా దగ్గరుండి రాయించి తెచ్చిన నమూనా" అన్నారు బ్లూప్రింటు తీసి బల్లమీదుంచి, ఆ గీత లెవ్వరికీ అర్థంకాలేదు.

ఇంగ్లీషులో రాసింది చదివి "ఇదొక మూడంతస్తుల బంగళా నమూనా. కనీసపు ఖర్చు లక్ష. మనం కట్టవలసేవి అయిదువేల రూపాయలతో జనతా ఇళ్ళు. అయిదిళ్ళకు ఇరవై అయిదు వేలు. ఇదెలా సాధ్యం. ప్రెసిడెంటుగారూ?" అన్నాడు చిన్నయ్య.

"వాడు చెప్పేది నిజమేనా?" అన్నారు తతిమ్మా నెంబర్లు కోరసుగా.

"మీకు నమ్మకం లేకపోతే పంతులుకి చూపించి అడగండి" చిన్నయ్య అన్నాడు.

"చిన్నయ్య అన్నది నిజమే. మనమే ఎడ్వరుటైజుమెంటులో ఎక్కడో తప్పు ఇచ్చేము. పోనీలెండి. మళ్ళీ పేపరుకు వేద్దాం. సరేనా?" అన్నారు ప్రెసిడెంటుగారు.

ఇంతలో ఫలహారాలు వచ్చాయి. షరా మామూలే!

"ఇవి కూడా ఇళ్ళ డబ్బుతోనేనా?" అని అడిగేడు చిన్నయ్య.

"మనం కూర్చున్నది దాని చర్చకేగా?" ఎదురు ప్రశ్న వేసేరు ప్రెసిడెంటుగారు.

చిన్నయ్య వాకౌట్ చేసేడు.

"అబ్బా! గాలీవానా వెలిసింది". వీరాస్వామి అన్నాడు వికృతంగా నవ్వుతూ.

"మనలో మన మాట. తమరు కాని బిల్డింగు కడుతున్నారా ఆ డిజైనుతో?" అన్నాడు మరో మెంబరు.

"లేదయ్యా- నేను జనతా ఇళ్ళ నమూనా అనే తెచ్చేను. పోనీ ఇదీ మంచిదే అయింది. ఎలాగూ మేడ లేపాలని అనుకుంటున్నాను." ఆ మెంబరు గ్లాసు నింపుతూ ప్రెసిడెంటుగారు అన్నారు.

అందరూ వేలిముద్రలు వేసేరు - తూలుతూ ఇళ్ళదారి పట్టేరు.

మళ్ళీ కొత్త టెండర్లు వచ్చేయి.

"ఈమారు మద్రాసు పోయొస్తాను" అన్నారు ప్రెసిడెంటుగారు. ఆ మీటింగుకి చిన్నయ్య రాలేదు. "నే నొచ్చినా రాకపోయినా ఒకటే. వస్తే నా పనులు దండుగ" అంటూ కబురు మాత్రం పంపేడు.

"ప్రతిమాటూ ప్రతి చోటికి మీరేనా? మరి మేం వేలిముద్రలు వేయడానికేనా?" అన్నాడు వీరాస్వామి. అతనికి మరో ముగ్గురి మద్దతు ఉంది.

"వీరాస్వామీ! ఇంకా అవకాశాలు లేకపోలేదు. ఈ తూరి నన్ను పోనీయి. మా పెద్దోడు మద్రాసులోనే చదువుతున్నాడు. వాడిని చూసి రావడమవుతుంది. పైగా మా ఆవిడకి తిరుపతిలో మొక్కు కూడా ఉంది. మళ్ళీ మారు నీ వంతేలే" అన్నారు అనునయంగా.

మూడో పర్యాయం వీరాస్వామి, అతని అనుయాయి బెంగుళూరు వెళ్ళి వచ్చేరు.

"అబ్బా! బృందావనం గార్డెన్లు చూడవలసినవేనండి. నా జన్మలో అలాంటి చోటు చూడలేదంటే నమ్మండి" అన్నాడు. అతడు అక్కడ చూసింది అదొక్కటే. ఇళ్ళ విషయంలో సంప్రదింపులకు వచ్చేరన్న మాట వాళ్ళిద్దరు మరిచేపోయేరు.

మళ్ళీ మీటింగు పెట్టేరు.

"మనకు ప్రభుత్వం ఇచ్చింది చాలా తక్కువ మొత్తం. దేశం హోలు మొత్తం మీద ఎవరూ ఇంత చిన్న మొత్తంలో అయిదు ఇళ్ళు కట్టలేరు. ఆ సంగతి మనకొచ్చిన టెండర్లు, నేనూ, వీరాస్వామీ స్వయంగా చేసొచ్చిన సంప్రదింపుల వలన తేలింది. ఇప్పుడేం చేయాలి?" అన్నారు తల పట్టుకొని ప్రెసిడెంటుగారు.

"నా మాట విని ఉంటే కట్టగలిగే వాళ్ళం" అన్నాడు చిన్నయ్య.

"ప్రభుత్వం రూల్సు ప్రకారం అయితే వినమనలేదే? ఇంతకీ ఏమిటి?" అన్నారు అందరు.

"మీరు దీనదయాళ్ పురం గురించి విన్నారా?"

"అదెక్కడుంది?"

మనరాష్ట్రంలో ఇంత తుఫాను రావడం, అంత జననష్టం జరగడం, ఇళ్ళూ, ఊళ్ళు తుడుచుకుపోవడమే తెలియదా?"

"ఆ సంగతి తెలియకేం."

"అదే! అలా తుడుచుకుపోయిన దివి తాలూకాలోనే కట్టేరు దీనదయాళ్ పురం. ఇంటికి ఖర్చు ఆరువేలు మాత్రమే. మనం కూడా అలా ఆలోచించి ఉంటే నిశ్చయంగా కట్టగలిగేవాళ్ళం."

"మరి ఆళ్ళు టెండరివ్వలేదే?"

"ఆ మీరు ఢిల్లీ, మద్రాసు అంటూ పరుగెట్టేరు. మన విశాఖపట్నం పేపరుకో, విజయవాడ పేపరుకో ఇచ్చా రా ప్రకటన?"

"అద్దాలలో బిడ్డను పెట్టుకుని దేశమంతా గాలించేరు. ఆళ్ళు మన జిల్లా వాళ్ళే. వాళ్ళను కలుసుకొనిఉంటే చిటికెలమీద పని అయ్యేది." పూర్తి చేసేదు చిన్నయ్య. కోపంతో అతడు వూగిపోతున్నాడు.

"చిన్నయ్యా! అంత కోపమెందుకు? శాంతంగా మాట్లాడు. పోనీ విశాఖపట్నం నువ్వు పోయొస్తావా? అదీ ప్రయత్నిద్దాం." అన్నారు ప్రెసిడెంటుగారు.

"నేను వెళ్ళవలసిన అవసరం లేదు. ఇదిగో – ఇంటి నమూనా. జనతా ఇల్లు. అయిదువేల ఆరువందల్లో ఇల్లు అవుతుంది. అయిదిళ్ళు కట్టడానికి మూడు నెలలు చాలు. కట్టిస్తారా? చెప్పండి."

చిన్నయ్య చకచకా వెళ్ళిపోయేడు. వాళ్ళ జవాబైనా వినకుండా. కట్టించే స్థితిలో లేరని చిన్నయ్యకు ముందే తెలుసు.

★ ★ ★

పై సంఘటన జరిగి మరో నెల రోజులు గడిచిపోయింది. పంచాయతీ ఆఫీసులో కూర్చొని ప్రెసిడెంటుగారి మూడంతస్తుల (కొత్తగా వెలసిన) భవంతిలో ఒక గది ఆఫీసుకని కేటాయించేరు (అద్దెకే ననుకోండి).

"పంతులూ! ఇళ్ళ నిర్మాణ పథకం గురించి ఫైనలు రిపోర్టు ఇవ్వాళ్ళేగా పంపవలసింది. లెక్కలు తయారయ్యాయా?" అన్నారు చుట్ట కాల్చుకుంటూ.

"అయ్యా! అదే చేస్తున్నాను. ఇదిగో మరో అరగంటలో టెలిగ్రామ్ వెళ్ళిపోతుంది. ఏం రాసేనో చదవమంటారా?"

"ఆఁ! ఏం చదువుతావు? నువ్వు సరిగ్గానే రాసి ఉంటావు. అయినా ఆ ఇంగ్లీషు ముక్కలు నా తల కెక్కుతాయా? నీకు చదవాలని ఉంటే చదువు. తప్పులుంటే దిద్దుకుందువుగాని."

"ఫైనాన్షియల్ టార్గెట్ ఎచీవ్డ్ హండ్రెడ్ పెరసెంటు. ఫిజికల్ టార్గెట్సు నిల్" అన్నాను.

"అంటే ఏమిటయ్యా? మన కొంపలేం అంటుకోవుగా?" అన్నారు భయం భయంగా.

నాకు నవ్వొచ్చింది. ప్రభుత్వం డబ్బుతో దగ్గరుండి ఢిల్లీ వాళ్ళచే వేయించుకు వచ్చిన నమూనా ప్రకారం ఆరు నెలల్లో కట్టించిన ఈ కొంప (మూడంతస్తుల భవంతి) ఎలా అంటుకుంటుందనుకుంటున్నారు?

"మరేం భయం లేదు. విత్తీయ లక్ష్యం నూరుశాతం సాధించేం. భౌతిక లక్ష్యం శూన్యం" అని అన్నాను.

ప్రెసిడెంటుగారు అనవసర విషయాలు వినరు – అందుకే నేను అర్థం చెప్పడం వారు వినలేదు. చుట్ట కాల్చుకోవడంలో మునిగి తేలుతున్నారు.

"అయ్యా! నేనిచ్చిన టెలిగ్రాఫ్‌లో కొంత లోపం ఉంది" అన్నాను.

"అదేమిటి, పంతులూ?"

"మనకు ప్రభుత్వం ఇచ్చిన డబ్బు పూర్తిగా ఖర్చు కాలేదు. మూడు వేల మూడు వందల ముప్ఫై మూడు రూపాయలు మిగులుతున్నాయి. అయితే అదో పెద్ద లెఖ్ఖల్లోకి రాదు బడ్జెట్టు లెఖ్ఖలలో."

"అలా లాభంలేదు, పంతులూ. ఆడిటోళ్ళు అనుమానిస్తారు. ఆ సొమ్ము పద్దుల్లో కలిపేలేక పోయావా?"

"అది కుదిరేది కాదు."

"ఏం? ఎందుకు కుదరదు? ఇంతకీ ఖర్చు పద్దు చదువు."

"చిత్తం" అని పుస్తకం తీసి, "ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణపు ఖర్చుకి ఇచ్చిన గ్రాంటు ఇరవై అయిదు వేలు" అన్నాను.

"అది మనకు తెలిసిందే కదయ్యా. కావలసింది ఖర్చు."

"చిత్తం. అదీ చదువుతాను. పేజీ తిప్పడానికి ఆగేను" అన్నాను. "చెక్కు పొందడానికి హైదరాబాదులో ఉద్యోగుల కిచ్చిన బక్షీసులు అయిదువందలు. మంత్రిగారి రాక సందర్భంగా అయిన ఖర్చు మూడువేలు. సదరు మంత్రిగారికి విందు ఖర్చు ఆరువందలు. అఖిలభారత స్థాయిలో ప్రభుత్వ ప్రకటనకైన ఖర్చు పన్నెండు వందలు. టెండరు కోసం ఇచ్చిన ప్రకటన ఖర్చు రెండువేలు. టెండర్లను పరిశీలించడానికి ప్రెసిడెంటుగారు ఢిల్లీ, చండీఘర్‌ల యాత్రల ఖర్చు అయిదువేలు. ఢిల్లీ వారి టెండరు ఆమోదయోగ్యం కానందున తిరిగి మద్రాసు, హైదరాబాదులు వెళ్ళిన యాత్రల ఖర్చు ఆరువేలు. టెండరు విషయమై వివరంగా సంప్రదింపులకుగాను ఇద్దరు మెంబర్ల టి.ఎ.ఖర్చులు రెండువేలు. మంత్రిగారి రాక సందర్భంగా తీసిన ఫోటోల ఖర్చు ఆరు వందలు. పంచాయితీ మీటింగులకైన ఖర్చు ఆరువందలు. ఉత్తర ప్రత్యుత్తరాల ఖర్చు రెండు వందలు. వెరశి ఖర్చు. .... మిగులు...."

"పంతులూ సొమ్ము తిరిగి ఇవ్వడం ఆనవాయితీ కాదు. పంతులూ. నాకో అనుమానం. నా టూరు డబ్బులు సరిగా ఇచ్చేవా? వారా లేదుగా? మరో మారు చూస్తావా ఆ పద్దులు?"

"అయ్యా అంతా సరిగ్గానే రాసేను. ఇచ్చేను. తమరి కొక్క నయాపైసా తక్కువ ముట్టలేదు.

ఆఖరికి అమ్మాయిగారి పెళ్ళి విషయమై తమరు విజయనగరం వెళ్ళినందుకు అయిన కారు పెట్రోలు ఖర్చు మీ టూరు భత్తా అంతా చేర్చేను."

"కొంపతీసి పెళ్ళి విషయం రాయలేదుగా? ఆడిటోళ్ళు పట్టుకుంటే అదొక అప్రతిష్ఠ."

"ఆ భయం అక్కర్లేదు. ఇళ్ళ విషయమనే రాసేను.

"శభాష్. పంతులూ! నువ్వు విశ్వాసం ఉన్న మనిషివి."

విశ్వాసం ఉన్న మనిషంటే నాకు కుక్క గుర్తుకొస్తుంది. అలాగ నన్నెవరైనా అంటే కోపం వస్తుంది. అయితే పేదవాడి కోపం పెదవి చేటు.

"పంతులూ! మళ్ళీ ఏడు మనమే గెలుస్తాంలే పై ఏడు నీ జీతం డబుల్ చేస్తాను."

"అయ్యా! ఆ చేసేదేదో ఈనాడే చెయ్యరాదా?"

"ఇప్పుడా? మనది లోటు బడ్జెట్టని తెలుసుగదయ్యా. వచ్చే ఏడు ఏవో పన్నులు పెంచుదాం. అన్నట్టు పునాదుల తవ్వకానికి మూడువేల ఖర్చు అని పద్దులో రాసేయి."

"పునాదులా? తవ్వందే?"

"దానికేం? ఇవాళ తవ్వాం. రేపు ఉండాలని రూలా? గాలీవానలకు కప్పడి పోయేయి. ఆడిటోళ్ళు అడిగితే అది మన సమాధానం. అన్నట్లు, పంతులూ రేపు నీ స్వంత పనిమీద విజయనగరం వెళ్తున్నావుగా – ఆ మూడు వేలు నా పేర బేంకులో కట్టేయి. ఆ చేత్తోనే మా మేనల్లుడు రంగయ్య దగ్గర నుంచి పునాదుల తవ్వకానికి మూడువేలు ముట్టినట్లు కాగితం తీసుకో."

★ ★ ★

"చూడు, పంతులూ! నువ్వెలాగూ వెళ్తున్నావని చెప్పేను. ఇది మన స్వంత పని కదా. మరి నీకు టి.ఎ. లేదు. ఇంకో మాట. ఇంకెంత మిగులుతోంది? మూడువందల ముప్ఫైమూడేగా? ఒక పని చెయ్యి. వైరు ఇవ్వడం మానేసి మనిషి చేత రిపోర్టు పంపు. ఎల్లుండికల్లా చేరాలా? ఈ పోస్టలు వాళ్ళను నమ్మలేం. ఎవరో ఎందుకు? మా పెద్దోడు ఇంటర్వ్యూకి హైదరాబాద్ వెళ్తున్నాడు. వాడికే

ఆ ఉత్తరం, ఆ సొమ్ము ఇచ్చి రసీదు తీసుకో. అమ్మయ్య! ఇప్పటికి లెక్క తేలిందయ్యా! లక్ష్యం పూర్తి చెయ్యకపోతే మళ్ళీ సంవత్సరం గ్రాంటు వస్తుందా? ఆఁ! అంతా సవ్యంగా ఉన్నట్లేగా. నేనొస్తాను. అబ్బాయిని పంపుతాను."

"చిత్తం" అన్నాను. ఆ రెండు పద్దులు రాసేసి నా పని అయిందనిపించుకున్నాను.

పని చెయ్యాలని తలచుకోవాలే కాని లక్ష్యం సాధించలేమా?

మంత్రిగారు గ్రాంటు సంపాదించి లక్ష్యం సాధించగలిగేరు కదా?

ప్రెసిడెంటుగారు ఖర్చు విషయంలో లక్ష్యం సాధించగలిగేరు కదా?

కథ ముగించే ముందు నేను సాధించిన లక్ష్యం గురించి చెప్పకపోతే మీరు నన్ను తప్పు పట్టుకుంటారు. ఈ సంగతి నేటి రాజకీయ పరిస్థితులు తెలియనిదెవరికయ్యా! రోజూ పేపర్లలో మేము ఇలాంటి వార్తలు చదవటంలేదా? నువ్వు పని కట్టుకొని కథ రాయాల్సింది దేనికి అని కోపగించుకుంటారు. అవునా?

నిజమే. మీరు చెప్పేది అక్షరాలా నిజం.

**(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 25.10.1978)**